

ఇందిరాపార్కులోని ధర్నాచౌక్‌లో నిర్వహించిన మాదిగల యుద్ధభేరి సభలో అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్ రావు. చిత్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

# ఎస్సీ వర్గీకరణకు మోదీ అడ్డు

## తొలి అసెంబ్లీలోనే వర్గీకరణకు తీర్మానం చేసినం • బిల్లు పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం

- దేశంలో ఎక్కడాలేనివిధంగా దళితబంధు
- హైదరాబాద్‌లో మాదిగల ఆత్మగౌరవ భవనం
- సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
- వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- మాట తప్పిన పార్టీ బీజేపీ: వంగపల్లి
- వర్గీకరణ పేరుతో మోసం: మేడి పాపయ్య

కవాడిగూడ, నవంబర్ 5: తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మొదటి అసెంబ్లీలోనే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి ఢిల్లీకి పంపారని వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టంచేశారు. కానీ, కేంద్రంలోని మోదీ సర్కార్ వర్గీకరణ తీర్మానంపై నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తున్నదని ఆరోపించారు. హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మాదిగ యుద్ధభేరి సభకు మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఎన్నో ఏండ్లుగా నిరంతరం పోరాడుతున్నదని అన్నారు. స్వరాష్ట్రం సిద్ధించాక, తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని తెలిపారు. నాటి ఉప ముఖ్యమంత్రులు తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరితో తీర్మాన కాపీలను ఢిల్లీకి పంపించామని గుర్తుచేశారు. మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి, వర్గీకరణపై అసెంబ్లీ తీర్మాన కాపీని అందజేశారని స్పష్టంచేశారు. కానీ, మోదీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేసిందని విమర్శించారు. శాసన సభ పంపిన తీర్మానంపై పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం చేయడానికి మోదీ ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటో తెలియట్లేదని అన్నారు. జాతీయ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని, ఎస్సీ వర్గీకరణ కల బీఆర్‌ఎస్ సాకారం చేస్తుందని స్పష్టంచేశారు.

### బీఆర్‌ఎస్‌కే మాదిగల మద్దతు

బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి, తొమ్మిదిన్నరేండ్లు గడిచినా ఊసే ఎత్తలేదని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించినా కేంద్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. మంత్రి హరీశ్‌రావు హామీ ఇస్తే వారం రోజుల్లో మాదిగల భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని, ఆ సభకు సీఎం కేసీఆర్‌ను తీసుకురావాలని కోరారు. మాదిగల పూర్తి మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంటుందని స్పష్టంచేశారు. ఎమ్మార్పీఎస్ పేరుతో కొంతమంది వ్యక్తులు మాదిగలను వర్గీకరణ పేరుతో మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సువర్ణ రాజు, రాష్ట్ర నాయకులు సంద్ర వెంకటయ్య, బంగారి శ్రీనివాస్, బాబురావు, మహిళా అధ్యక్షురాలు రుక్కమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### దళితబంధుతో దళిత అభ్యున్నతి

దళితజాతి అభ్యున్నతి కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారని హరీశ్‌రావు చెప్పారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా రూ.10 లక్షల సాయం అందజేసి, దళితులను ఓనర్లుగా, వ్యాపారులుగా మార్చారని పేర్కొన్నారు. జిల్లాకో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి దళిత విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గానికో ఎస్సీ గురుకులం, రాష్ట్రవ్యాప్తంగా 50 ఎస్సీ మహిళా డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎస్సీలకు ఇచ్చిన అసైన్డ్ భూములను పట్టా భూములుగా గుర్తిస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో మాదిగల ఆత్మగౌరవ భవనం నిర్మించి, సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యమ పార్టీ అయిన బీఆర్‌ఎస్ ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఉద్యమాన్ని గౌరవిస్తుందని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో డైట్, శానిటైజేషన్ విభాగాల్లో ఎస్సీ రిజర్వేషన్స్ అమలు చేస్తున్నామని వివరించారు. ఇరిగేషన్ కాంట్రాక్టుల్లో కూడా రిజర్వేషన్స్ తెచ్చామని స్పష్టంచేశారు. నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



ఇందిరాపార్కులోని ధర్నాచౌక్‌లో నిర్వహించిన మాదిగల యుద్ధభేరి సభకు హాజరైన ప్రజలు



కూకట్‌పల్లిలో ఎరుకల ఆత్మగౌరవ సభలో మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

# స్వరాష్ట్రంలోనే ఎరుకలకు ఆత్మగౌరవం

- ఎరుకలకు ఎమ్మెల్సీ చాన్స్ ఇచ్చిందే సీఎం కేసీఆర్
- రూ.60 కోట్లతో ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీమ్
- నాంచారమ్మ జాతర అధికారికంగా నిర్వహణ
- నగరంలో రూ.5 కోట్లతో ఆత్మగౌరవ భవనం
- 10% రిజర్వేషన్‌తో ఎరుకలకు విద్య, ఉద్యోగాలు
- ఎరుకల ఆత్మగౌరవ సభలో మంత్రి హరీశ్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 5: రాష్ట్రంలో ఎరుకల జాతి మేలు కోసం రూ.60 కోట్లతో ఎంపవర్‌మెంట్ స్కీమ్‌ను ఏర్పాటు చేశామని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఎరుకల జాతి ఆరాధ్యదైవం నాంచారమ్మ జాతరను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నిజాంపేటలో ఎకరం విస్తీర్ణంలో రూ.5 కోట్లతో ఎరుకల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించినట్టు చెప్పారు. ఎరుకల జాతి కోసం నగరంలో స్థలాలను కేటాయించేందుకు కృషిచేస్తామని హరీశ్ హామీనిచ్చారు. గత ప్రభుత్వాలు ఎరుకలను చిన్నచూపు చూశాయని, రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఎరుకల కులస్థుల నుంచి ఎమ్మెల్సీగా కుర్రా సత్యనారాయణకు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారని గుర్తుచేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశమిస్తే బీజేపీ అనుకూల గవర్నర్ ఆపారని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యేల కోటాలోనే సత్యనారాయణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని అప్పుడు వాళ్లేమీ చేయలేరని స్పష్టంచేశారు. తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ, గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కూకట్‌పల్లిలో నిర్వహించిన ఎరుకల ఆత్మగౌరవ సభలో హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఎంపవర్‌మెంట్ స్కీమ్‌ను రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో అమలుచేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో కూడా అమలుకు తన వంతు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. మార్కెట్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల ప్రఖ్యాత బోయినపల్లి మార్కెట్‌కు తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి రాములు అధ్యక్షుడు కాగలిగారని చెప్పారు. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఎరుకల, లంబాడి, కోయ, గోండు జాతుల పిల్లలు విద్య ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు పొందుతారని, తద్వారా డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారని వివరించారు. విదేశాల్లో చదువుకునేందుకు అంబేద్కర్ ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్ ద్వారా రూ.20 లక్షలు అందిస్తున్నట్టు మంత్రి హరీశ్ చెప్పారు.

### తెలంగాణ వ్యతిరేకులతో ఆ పార్టీల పొత్తు

తెలంగాణ వ్యతిరేకులైన కిరణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కల్యాణ్‌లతో బీజేపీ మిలాకత్ అయిందని, వైఎస్ షర్మిల లాంటి తెలంగాణ ద్రోహులతో కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసిపోయారని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణపై ద్రోహులంతా ఒక్కటై కుట్రలు చేస్తున్నారని, దీనిని ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో కరువు లేదని, కర్ఫ్యూ లేదని, ప్రజలంతా ప్రశాంతంగా జీవిస్తున్నారని చెప్పారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ హైదరాబాద్ నగరం న్యూయార్క్ తరహాలో అభివృద్ధి చెందిందని మాట్లాడుతుందే కాంగ్రెస్ పార్టీలోని గజనీకాంత్‌లకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ హైదరాబాద్ సింగపూర్‌లా అభివృద్ధి చెందిందని మెచ్చుకుంటే ఇక్క డి బీజేపీ నేతలకు మాత్రం అభివృద్ధి కనిపించడం లేదని మండిపడ్డారు. తలలో నాలుకలా ఉండే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మరోసారి గెలిపించాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు కుర్రా సత్యనారాయణ, కుతాడి రాములు, ప్రధాన కార్యదర్శి లోకిని రాజు, కోశాధికారి రవికుమార్, గ్రేటర్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎల్లేశ్, శ్రీరామాఆనంద్, నాగులు, పోచయ్య పాల్గొన్నారు.



ఎరుకల జాతి ఆత్మగౌరవ సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

# మరో ఐదు రోజులే గడువు

- నామినేషన్ల నమోదుకు 10న చివరిరోజు
- ఇప్పటివరకు 236 మంది అభ్యర్థుల నామినేషన్లు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి మరో ఐదు రోజులే గడువు ఉన్నది. ఈ నెల 10న నామినేషన్ల గడువు ముగియనున్నది. ఈ నెల 3న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు 236 మంది అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు మంచిరోజు కోసం చూస్తున్నట్టుగా సమాచారం. ఈ నెల 8,9న మంచి రోజులు ఉన్నాయని, 8న దశమి, 9న ఏకాదశి ఉండటంతో, 10న చివరిరోజు అయినందున ఈ మూడుదినాల్లో అత్యధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలవుతాయని అధికారులు భావిస్తున్నారు. గుర్తింపు పొందిన పార్టీలతో పాటుగా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడాఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయాల వద్ద పోలీసులు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నారు. అభ్యర్థికి సంబంధించిన మూడు వాహనాలు, అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు.

## • పెద్ద కొడుకు కేసీఆర్ 2 వేలు ఇస్తున్నడు



'నా పెద్దకొడుకు కేసీఆర్ నెలకు రెండు వేల పదహార్లు ఇస్తున్నడు. ముసలోళ్లకు మందులు, ఇతర ఖర్చులకు ఇవి ఎంతో ఉపయోగపడుతున్నయి. ఈసారి పింఛన్ రూ.5 వేలు ఇస్తమని అంటున్నడు. ముసలోళ్లను కడుపులో పెట్టి చూసుకుంటున్న కేసీఆర్‌కే ఓటు వేస్తా'. బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా, గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగమ్మ.. సీఎం కేసీఆర్‌ను తలుచుకుంటూ సంబురంగా చెప్పిన మాటలివి.

- ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

## • కేసీఆరే నాకు జీవగంజి అయ్యిండు



'నాకు భర్త, పిల్లలు లేరు. గూడూ లేదు. రెండు కాళ్లు పన్జేయవు. బతుకు మీద ఆశ పోయింది. ఎందుకు బతకాలని అనుకున్న తరుణంలో సీఎం కేసీఆర్ దేవుడిలా ఆదుకొని నాకు జీవగంజి పోసిండు. రూ.2016 పింఛన్ ఇచ్చి పెద్ద కొడుకుగా మారి అండగా నిలిచిండు' అని పాలకుర్తికి చెందిన వృద్ధురాలు కోట పుల్లమ్మ చెప్పింది. పింఛన్‌తోనే బతుకుతున్నానని, రేషన్ బియ్యంతో కడుపు నింపుకుంటున్నానని వివరించింది. 'ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవాలి. కేసీఆర్ వస్తేనే.. మాకు మళ్లీ పింఛన్ పెంచి ఇస్తాడు' అని పేర్కొన్నది.

- పాలకుర్తి

# ఏజెంట్లను నియమించుకునే అధికారం అభ్యర్థికే

- పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్‌కు నో ఎంట్రీ
- 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిషిద్ధం
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమంతట తామే పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాటర్ బాటిళ్లు, స్నాక్స్, ఆహార పదార్థాలను అనుమతించేది లేదని చెప్పింది. పోలింగ్ స్టేషన్ నుంచి 100 మీటర్ల పరిధిలో కార్డ్‌లెస్ ఫోన్లు, వైర్‌లెస్ సెట్లు, స్పై కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ డివైజ్‌ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీచేసింది. ప్రతి అభ్యర్థి తన పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో ఏజెంట్, రిలీవర్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు. మాక్ పోలింగ్ నుంచి ఈవీఎంలను సీజ్ చేసే వరకు ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో ఉండొచ్చు. పోలింగ్ ఏజెంట్‌కు ఓటరు గుర్తింపు లేదా మరేదైనా ఇతర గుర్తింపు కార్డు ఉండాలి. కేంద్రంలో ఏజెంట్లను జాతీయ, ప్రాంతీయ, రిజిస్టర్డ్ పార్టీలవారీగా ప్రాధాన్య క్రమంలో కూర్చోబెడతారు. ప్రభుత్వ ఉద్యోగులు లేదా ప్రభుత్వం నుంచి భద్రత పొందుతున్నవారు పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించేందుకు వీల్లేదు. ఓటు వేసేందుకు వచ్చేవారిని ఏజెంట్లు అడ్డుకోకూడదు. ఓటర్లలో ఎవరైనా అప్పటికే ఓటు వేసినట్టు ఏజెంట్‌కు అనుమానం ఉంటే ప్రిసైడింగ్ అధికారికి మాత్రమే అభ్యంతరాన్ని తెలపాలి. పోలింగ్ రోజున అభ్యర్థులుగానీ లేదా వారి ఏజెంట్లుగానీ కేంద్రానికి 100 మీటర్ల లోపల ఎన్నికల ప్రచారం చేయకూడదు. ఏజెంట్లు తమ అభ్యర్థి పేర్లను, గుర్తులను, ఫోటోలను, పార్టీ జెండాలను పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ధరించకూడదు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ముందు జరిపే తనిఖీలకు ఏజెంట్లతో పాటు ఓటర్లు విధిగా సహకరించాలి.

### ఎడమ చేతి చూపుడు వేలుకు ఇంకు

పోలింగ్ సమయంలో ఓటరు ఎడమ చేతి చూపుడు వేలుకు నిలువుగా ఇంకు పెడుతారు. ఒక వేళ ఓటరుకు చూపుడు వేలు లేకుంటే మరో వేలికి, అసలు ఎడమ చేయి లేకుంటే కుడి చేతి చూపుడు వేలుకు ఇంకు పెట్టవచ్చని ఎన్నికల సంఘం తన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. దీని ద్వారా ఆ వ్యక్తి ఓటు హక్కు వినియోగించుకున్నట్టు గుర్తిస్తారు. తద్వారా ఆ వ్యక్తి మరోసారి ఓటు వేయకుండా అడ్డుకోవచ్చు.

# 14 మందితో సీపీఎం జాబితా

- జానా విజ్ఞప్తిని తిరస్కరించిన తమ్మినేని
- కాంగ్రెస్, సీపీఐ పొత్తు ఖరారు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 14 మంది అభ్యర్థుల జాబితాను సీపీఎం ఆదివారం విడుదల చేసింది. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మీడియాతో మాట్లాడుతూ.. మరో మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. సీపీఐ పోటీ చేసే స్థానాల్లో వారికి మద్దతిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను కూడా విడుదల చేశారు. జర్నలిస్టులకు 300 గజాల స్థలం, రూ.10 వేల పెన్షన్ ఇస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ నెల 7న తాను పాలేరులో నామినేషన్ వేయనున్నట్టు వెల్లడించారు.

### తమ్మినేనికి జానారెడ్డి ఫోన్

జాబితాను ప్రకటించవద్దంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఫోన్ చేయగా తమ్మినేని వీరభద్రం తిరస్కరించారు. రాష్ట్రంలోని 17 స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టంచేశారు. సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ విధానం తీవ్ర అసంతృప్తికరంగా, అవమానకరరీతిలో ఉన్నదని చెప్పారు.

### సీపీఐ-కాంగ్రెస్ పొత్తు ఖరారు

చర్చల అనంతరం కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు కుదిరినట్టు సమాచారం. సీపీఐకి కొత్తగూడెం అసెంబ్లీ స్థానంతోపాటు ఎమ్మెల్సీ సీటు ఇచ్చేందుకు అంగీకరించినట్టు తెలిసింది. ఖమ్మం జిల్లాలో సీపీఎంకు సీటు ఇవ్వాలని సీపీఐ నేతలు కోరగా.. ఈ అంశంపై సీపీఎం కేంద్ర కమిటీతో అధిష్ఠానం చర్చిస్తుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సమాచారం. మునుగోడులో స్నేహపూర్వక పోటీ చేయొద్దని సీపీఐ నేతలకు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై పార్టీలో చర్చిస్తామని సీపీఐ నేతలు స్పష్టంచేశారు.





చెన్నూరులో బాల్క సుమన్‌కు రూ. 51 వేలు అందిస్తున్న సర్పంచ్ దర్శనాల రమేశ్

# బీఆర్‌ఎస్‌కు వెల్లువెత్తిన అభిమానం

- అభ్యర్థుల ఎన్నికల ఖర్చు కోసం విరాళాలు

భీమారం/ధర్పల్లి, నవంబర్ 5: బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు కోసం విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు ఎన్నికల ఖర్చుల కోసం పోలంపల్లి సర్పంచ్ దర్శనాల రమేశ్ రూ. 51 వేల సాయమందించారు. విప్ భారీ మెజార్టీ గెలుస్తాడని ఆకాంక్షించారు. నిజామాబాద్ రూరల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఎన్నికల ఖర్చుల కోసం ధర్పల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. బాజిరెడ్డి నివాసానికి ఆదివారం వెళ్లి, ఎమ్మెల్యేను సన్మానించి విరాళాన్ని ఇచ్చారు.

# 28 నుంచి 30 వరకు మద్యం దుకాణాల బంద్

- ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఈ నెల 28 నుంచి 30 వరకు మద్యం అమ్మకాలను బంద్ చేయాలని వైన్స్, బార్ల యజమానులకు కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ యజమానులను అప్రమత్తం చేసింది. ఎన్నికలను సజావుగా నిర్వహించే క్రమంలో ఈసీ ఆదేశాలను పాటించాలని సూచించింది. లేనిపక్షంలో లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించింది.